# 11. మంజుల

ఈ రోజు మంజుల జీవితంలో అతి ముఖ్యమైనది; ఆమె బావి జీవితమంతా ఈ ఒక్కనాటి పరిస్థితుల్లోనే తేలిపోతుంది. ఇది సుదిన మౌతుందో -- దుర్దినమౌతుందో--ఏ జ్యోతిష్కుడు చెప్పగలడు?

అద్దంముందు కూర్చొని, తల దువ్వుకుంటూ తన వికృత ముఖమండలాన్ని చూసి ఆమె తన హృదయాన్ని తానే గాయపరుచుకుంటోంది. ఆ ముఖంలో ఉన్న ఒక్కొక్క మచ్చ తన రూపానికే ఒక్కొక మచ్చ. నల్లబారి గుంటలుపడ్డ ఆమె ముఖం అబ్బ! అందం ఉన్నవాళ్ళందరూ ఈమెను చూసి తప్పకుండా తమకు తాము గర్విస్తారు. తనలాటి వ్యక్తులే యీ లోకంలో సౌందర్యానికి ఎక్కడలేని విలువనూ ఇవ్వగలరు!

తన ముఖమే-నిర్జీవపు దర్పణంలో ప్రతిఫలించి తనను వెక్కిరించి వేళాకోళం చేస్తోంది. చిత్రకారుడు సౌందర్యంలో ఐక్యమైపోగలడు. ప్రశాంత క్షణాల్లో ప్రకృతిలో ఉండే సౌందర్యాన్ని చూసి, మెచ్చుకోగలడు. అంతే కాదు కృషిచేసి ఇతరులచేత మెప్పించగలడు. కాని ఏ చిత్రకారుడూ వికృత రూపాన్ని గీసి తనకు తను మెచ్చుకోనూలేడు, ఇతరుల చేత అంతకుమునుపే మెప్పించలేడు! సౌందర్యమయమైన యీ లోకంలో కురూపైన తను ఆణిముత్యాల్లో నత్తగుల్లలాగు పడివుంది!

ఎదురింటి ఆరేళ్ళ 'బాల' తల్లిని వదిలి తన దగ్గరకు పరుగెత్తుకు వచ్చేది. తను కూడా బాలగామారి ఆమెతో ఆటలాడుకునేది. కాని తన రూపు మారాక బాల తనను చూసి ఇంట్లోకి పారిపోతోంది. అప్పుడు ఆమెకు తనలో కన్పించిన అమృతానికీ-- ఇప్పుడు కన్పించే విషానికీ ఎంత భేదం! సౌందర్యాన్ని ప్రేమించటమనేది మానవజాతికి ఉగ్గుపాలతో పెట్టేదేమో?

తనకున్న ఆభరణా లన్నింటినీ ధరించి, నిలువుటద్దం ముందు నిలబడి చూసుకుంది. తన ముఖం తప్ప ఆమె మిగతా శరీరాకృతి సొంపుగా వుంది. ఈ కృత్రిమ ఆభరణాలకే సౌందర్యాన్నివ్వగల శక్తి వుంటే లోకంలో చాలా మంది 'మేం అందమైనవాళ్ళం' అని మనస్ఫూర్తిగా గర్వించేవాళ్ళు.

తన ముఖాన్ని చూసుకొన్న మంజులకు మాత్రం 'నా భర్త నన్ను ఎల్లా ప్రేమిస్తాడు? ఏ కంటికీ బాగుండని నేను నా భర్త కంటికి బాగుంటానా? భగవంతుడు నాలాటివాళ్ళను సృష్టించి వినోదిస్తాడు కాబోలు--కాదు! మొదట్లో నన్ను సృష్టించినప్పుడు పరాకుగా ఉండివుంటాడు. ఈ జీవిత మధ్యంలో కురూపిగా చేసి ఆటలాడుకుంటాడు కాబోలు! ఏదో వొక వంక మీద పండులాటి కాపురాన్ని పాడు చేస్తేనే కాని ఆయనకు తృప్తి వుండదు కాబోలు....' అని స్ఫురిస్తోంది.

శూన్య దృక్కుల్తో అనంతాకాశంలోకి చూస్తూన్న మంజుల ఊహాతరంగాల్లో తల్లడిల్లుతోంది. ఆమె అనుకుంది:

'బహుశా నేను గతజన్మలో ఎంతమంది కురూపుల్ని వెక్కిరించానో--యిప్పుడు నా ప్రతిబింబంచేతకూడా వెక్కిరించబడి వేళాకోళంగా చూడబడేటందుకు! నా రూపహీనత... ఎవర్నీ ఎప్పటికీ ఆకర్షించలేదు... ఇది నాకు దృఢంగా తెలిసిన విషయం...నేను ఎప్పుడూ ఎవరికీ ఏ అపకారమూ చెయ్యలేదే... దేవుడు నాకు యీ అపకారం చేసేందుకు! నా కీ నేరంలేని శిక్ష ఎందుకో? ఎంతమంది దృష్టికి నేను దిష్టిపిడతలా కన్పిస్తున్నాను! నన్ను చూచి నవ్వే వాళ్లేకాని సానుభూతి చూపే వాళ్లే లేరే...'

మంజుల తలపు లన్నీ ఆమెను కృంగదీస్తున్నయ్. ఆమె తన భావి జీవితాంధకారాన్ని ఊహించుకో గలుగుతోంది.

ఒక సంవత్సరం క్రితం తన జీవితం ఎంత ఆనందదాయకంగా ఉండేది! అనుకూల దాంపత్యం ఈ లోకంలో ఎంత అరుదోననుకునేవాళ్ళు --తనను చూచి ఈర్ష్యపడేవాళ్ళు. ఒకసారి తన భర్త "నువ్వు నా ఆరో ప్రాణానివి" అన్నప్పుడు తన ఆత్మ ఎంత ఆనందించిందో!

"ఒక్క మృత్యువు తప్ప మనను విడదీసే శక్తి యీ లోకంలో యింక దేనికీ లేదు" అని భర్త అన్నప్పుడు తనకు యీ లోకం అమరలోకంగా మారింది.

"నువ్వు నాకోసమూ--నేను నీ కోసమూ ఎన్నాళ్ళయినా జీవిద్దాం--ఏం?..." అని తనను భర్త అడిగినప్పుడు, తనలోని శక్తులన్నీ కలిసి తన చేత 'ఊ' అనిపించలా?

మరోసారి చంద్రుణ్ని చూపుతూ "అంత చంద్రుడికి కూడా మచ్చ వుండాల్సిందే," అన్నాడు.

"ఆ మచ్చను చూసి మనం చంద్రుణ్ని ఏవగించుకోంగా--" అంది తను!

"కాని ఆ మచ్చ పెద్దదైతే...?" అర్థోక్తిలో నవ్వాడు తన భర్త.

అప్పుడు తను ఏ సమాధానమూ చెప్పలేదు. కాని ఈనాడు తన మచ్చ నిజంగా పెద్దదే అయింది. ఇప్పుడు తన భర్త కూడా దీనికి సమాధానం చెప్తాడు.

ఆకాశంలో తారలన్నీ కలిసి తన ముఖం మీది మచ్చల్లాగా ఉన్నై. కాని ఆ తారలకూ ఆ ఆకాశానికీ అందం వుంది. తనకు మాత్రం ఒకప్పుడు ఉండేది కాని ఇప్పుడు లేదు.

ఇంక కొద్ది గంటల్లోనే తన జీవిత పర్యవసానం తేలిపోతుంది. ఈ మాట జ్ఞాపకానికి వచ్చినప్పుడు ఆమె శరీరం భయంతో ఆపాదమస్తకమూ కంపించింది.

ఏ కళ్ళతో తన రూపును చూసుకుందో- ఆ కళ్ళ నుంచే రాలే విషాద బాష్పాలను ఆమె, 'నా హృదయం కరిగి... కార్చే కన్నీరిది' అనుకొంది.

## 2

గడియారం పది గంటలు కొడుతూండగా, కాళిదాసు పడక గది ప్రవేశించాడు. ఆరు నెల్ల క్రితం తను బొంబాయి వెళ్లినప్పుడు చూచాడు; మళ్లీ చూడటం ఇదే! ఆ గది అందాన్ని చూస్తూ క్షణకాలం ద్వారం దగ్గర నిలబడ్డాడు. గోడకున్న బొమ్మలన్నీ చేరి తనను పలకరిస్తున్నట్టు భావించాడు. 'సీలింగ్ లైట్' మెల్లిగా వీచే గాలికి ఉయ్యాల ఊగుతూ తనను ముందుకు ఆహ్వానిస్తోంది.

కాళీ గదినంతటినీ పరికించి చూచాడు. దక్షిణ వైపు కిటికీ దగ్గర నిలబడి ఆకాశంలోకి చూస్తూ మంజుల నిలబడి వుంది. తన రాకను కూడా ఆమె గ్రహించినట్టు లేదు.

ఎన్ని కొత్త శక్తులు అతనిలో ప్రవేశించాయో-- ఆ రాత్రి! బైట పిండార బోసినట్లు వెన్నెల. చంద్రుడు లోకాన్ని చూసి నవ్వుతూ నిండుముఖంతో కొబ్బరిమట్టలోంచి తొంగి తొంగి చూస్తూ మబ్బుల్ని తోసుకుంటూ పశ్చిమ దిశకు పరుగెత్తుతున్నాడు.

ఆమెను ఆశ్చర్యపెట్టాలని చప్పున స్విచ్‌వేసి లైటు ఆర్పాడు. ఆమె మాత్రం కదలకుండా ఇంకా ఆకాశంలోకే చూస్తోంది.

అడుగుల్లో అడుగులు వేసుకుంటూ మెల్లిగా వెనకాలే వెళ్ళి ఆమె కళ్ళు మూసాడు. అతని చేతులకు అంటిన తడిని బట్టి ఆమె కన్నీరు కారుస్తోందని కాళీ గ్రహించాడు.

మంజుల మాత్రం అతి సున్నితంగా భర్త చేతుల్ని విప్పింది.

"మంజూ!" అన్నాడు ఆదుర్దాగా.

ఆమె కొంచెం ఆగి "ఊఁ" అంది, పొడిగొంతుకతో.

"కంటనీరు పెడుతున్నావా?"

ఆ వెన్నెల వెలుగులో ఆమె చీర చెరుగుతో కన్నీ రొత్తుకోవటం, కాళీ గ్రహించకపోలేదు.

మంజుల లేని ఉత్సాహంతో, "లేదు" అంది.

కాళీకి యీ మాట మీద ఏమాత్రమూ నమ్మకం కుదరలేదు; "ఎందుకూ, నాకు చెప్పవూ?" అన్నాడు, ఆమె గడ్డంపట్టుకొని బతిమాలుతున్నట్టు.

"ఏమీ లేదు...మీరు నిద్రపోండి..."

"మరి...నువ్వో?"

"నేను కిందికి వెళ్ళిపోతా--"

"కోపం వచ్చిందా?"

"లే-దు."

ఈ మాటల ధోరణి, కాళీకి అవగాహన కాలేదు. ఏదో తీవ్రసమస్యతో ఆమె వేగిపోతూన్నట్టు మాత్రం అతను గ్రహించాడు.

ఏదో ఆలోచించి మళ్ళీ లైటు వేసి కూజాలోని మంచినీళ్ళు తీసుకు వెళ్లి ఆమె పక్కనే నిలబడ్డాడు. ఆమె తల యింకా కిటికీలోనే వుంది.

"మంజూ! ఈ మంచినీళ్ళు తాగు--"

భర్త చేతిలోని గ్లాసును వెనుకనుంచే అందుకొని, అటేతిరిగి మంచి నీళ్లు తాగి గ్లాసును ఆ కిటికీలోనే వుంచింది. ఆమె వైఖరి అప్రసన్నతగా వున్నందుకు కాళీ నొచ్చుకున్నాడు. తన వైపు కూడా తిరిగి చూడకుండా మాట్లాడే శక్తి ఆమెలో వుందని అతనెప్పుడూ అనుకోలేదు.

ఆమె భుజాలపై చెయ్యివేసి తనవైపు తిప్పుకునేందుకు ప్రయత్నిస్తూ "మంజూ! నాకు చెప్పవూ?" అన్నాడు.

ఆమె మళ్లీ కిటికీ వైపే తిరిగేందుకు పెనుగులాడుతోంది.

అక్కడేదన్నా విశేషం వుందేమోనని అతను కూడా చూశాడు! ఏమీ లేదు! మామూలు ఆకాశమూ, మిణుకు మిణుకుమనే తారలూ, మామూలు చంద్రుడే కన్పిస్తున్నారు.

ఒక విధంగా...మంజుల ఇల్లా బిగతీసుకు కూర్చోటం కాళీకి అతి కష్టంగా తోచింది.

ఈసారి బలవంతాన ఆమెను తన వైపు తిప్పుకున్నాడు.

"నన్ను వదలండి--నేను వెళ్లిపోతాను" అని మంజుల మాట్లాడిన మాటలకు కాళీ మనస్సు గాయపడ్డది. ఏమైనా ఆమెను మాత్రం తనవైపు పూర్తిగా తిప్పుకోగలిగాడు.

ఆ విద్యుద్దీప కాంతిలో మంజులను చూసిన కాళీ తన కళ్లు తననే మోసం చేస్తున్నయ్యేమోననుకున్నాడు. తను భ్రమించటంలేదు! తన ఎదుట ఉన్న వ్యక్తి, తను మూడు సంవత్సరాల క్రితం మంగళసూత్రంతో బంధించిన మంజుల! కొన్ని నెలలపాటు తన జీవితాన్ని మధురతమం చేసిన మంజుల! తన ధర్మపత్ని మంజులకూ- ఈమెకూ ఎక్కడ పోలిక? తనను ఎవరో మోసం చేస్తూన్నట్టుంది! ఆ వికృతాకారం తన కళ్లల్లో సూదుల్ని పెట్టి పొడుస్తోంది!

కాళీ ఆశా సౌధాలన్నీ నేల మట్టమయ్యాయి. అతనిలోని రక్తమంతా ఘనీభవించినట్టు తోచింది. ఆమె భుజం మీద వున్న చేతులకు ఏం కష్టం తోచిందోకాని అవి ఇవతలికి వచ్చేసినయి. అతని ముఖం గుర్తు పట్టేందుకు వీలుకాని ఆకారాన్ని తాల్చింది. పూర్వపు అతని శక్తులన్నీ- ఎక్కడివక్కడ పటాపంచలయినయ్.

కళ్ళను రెండు చేతుల్తోనూ మూసుకొని ఒక్కసారి వెనక్కు తిరిగి కళ్లు తెరిచాడు. వెనకాలి నిలువుటద్దంలో ఆ మంజుల వికృతాకారం తలవొంచుకు నిలబడి వుంది. ముందు ఏ మంజులను చూశాడో వెనకాల కూడా అదే మంజుల ప్రత్యక్షమౌతోంది. తన జీవితాంతం వరకూ యీ మంజుల ఆకారం తన నీడలాగు తనను వదలదు. ఒకప్పుడు తను ఆరాధ్య దైవంగా- ఇలవేల్పుగా తలచిన మంజుల ఆకృతి రాక్షస రూపాన్ని తాల్చింది.

దురంతదుఃఖంతో, నిరాశతో, నిస్పృహతో ఆమె వైపు తిరిగాడు.

భర్త ఆశ్చర్యాన్ని ఆమె ఇదివరకే ఊహించుకుందనుకుంటాను. నేల వైపు చూస్తూ చిన్నపిల్లలాగు ఏడ్వనారంభించింది.

"ఎందుకు ఏడుస్తావ్?" కాళీ కొంచెం కరుకైన కంఠధ్వనినే ఉపయోగించాడు.

ఆమె కదలలేదు. మెదలలేదు.

"నాకీ సంగతి ఎందుకు రాయలేదు?" ఆమె ముఖాన్ని పైకెత్తి ఆమె కళ్ళల్లోకి చూస్తూ అడిగాడు. భర్త చూపుల్లో ఒక విధమైన భీకరత్వం ఆమెకు కనిపించింది.

"మీరు దిగులుపడతారని..." ఇంకేదో చెప్పబోతూన్న ఆమె మాటలకు అడ్డొచ్చి, "దిగులు!...ఇప్పుడు మాత్రం ఏమైంది?" అని వికటంగా నవ్వాడు. ఆమె మాట్లాడగలిగే శక్తిని కూర్చుకుంటూన్నట్టు, "నేను మీకు... తగను... నన్ను పోనివ్వండి..." అంది.

కాళీ తనను తను అద్దంలో చూసుకున్నాడు. ఎంత అందంగా వున్నాడు! తనకేనా యీ కురూపి భార్య! ఆమె తనకు తగని మాట అక్షరాలా నిజం!

కాళీ పెదవి విరుస్తూ, "ఔను; నువ్వు నాకు తగవు.... ఈ రోజు అమృతానికి ఆశపడితే విషం ఎదురైంది...నేను నిన్ను ప్రేమించలేను కూడాను..." ఇంకేమో చెప్పబొయ్యాడు కాని, ఆమె ఆ మాటలకు అడ్డు వచ్చి, "నన్ను నేనే ప్రేమించుకోలేను..." అంది. కాళీ వింటూ నిలబడ్డాడు.

"నేను మీకు అశాంతి నిస్తున్నాను. ఇది ఎవరి తప్పైనా కానివ్వండి, నా పాడుముఖాన్ని మీకు చూపుతూ ఇక్కడ వుండలేను..." చీర కొంగుతో ఆమె ముఖాన్ని కప్పుకుంది.

"నీ ఇష్టం...వెళ్తే వెళ్లు"-- కాళీ నిశ్చలంగా చూస్తూ నిర్లక్ష్యంగా అన్నాడు.

ఆమె, కన్నీరు తుడుచుకొని, వొంచిన ముఖాన్ని కూడా ఎత్తుకోకుండా సరాసరి మేడ దిగి వెళ్ళిపోయింది. ఆమె పోకను చూస్తూ నిలబడ్డ కాళీ కంటివెంట అప్రయత్నంగా అశ్రుకణాలు రాలినయ్.

గదిలో పటాలన్నీ తనను చూసి వెక్కిరిస్తున్నయ్. తన నిర్భాగ్యతకు చంద్రుడు కూడా నవ్వుతున్నాడు. తోటలోంచి గుడ్లగూబ వికారంగా సన్నని ఎలుగుతో కూస్తోంది.

## 3

కాళీకి వివిధ విషయాలు తలపుకు వచ్చి, ఆ రాత్రి నిద్రాదేవిని దూరంగా పారద్రోలాయి.

తను భోంచేస్తుండగా తల్లి, "కోడల్ని రెండు రోజుల క్రితమే తీసుకొచ్చాను. ఇంటికి ఎంత శోభ వచ్చిందో" అన్నప్పుడు తను లోలోపల ఎంత ఆనందించాడు! ఆ ముసలి ప్రాణికి గృహలక్ష్మిలా కన్పించిన మంజుల తనకు రాక్షసిలాగు కన్పించింది. ఒకే రూపు వివిధ విధాలుగా పరిగణించ బడటమూ, ఒకే వస్తువు వివిధ అభిప్రాయాలూ భావాలూ మానవ హృదయంలో అంకురింప చేయటమూ లోకానికి ఇది మొదటిసారి మాత్రం కాదు! ఆ ముసలి ప్రాణికేం తెలుసు తన మనోబాధ?

తన భార్య రూపలావణ్యానికి తనలో తను గర్వపడేవాడు. ఇప్పుడు తనకు గర్వభంగ మయింది.

ఒకసారి భార్యతో, "మంజూ! సౌందర్య పోటీ పరీక్షలు పెడితే, నీకు తప్పకుండా బహుమతి వస్తుంది సుమా!" అన్నాడు. ఇప్పుడేమనాలి?

ఈ ఆరు నెల్లలోనూ తను భార్య కోసం ఎంతగా ఉవ్విళ్ళూరాడు! పరీక్షలు అయిపోయిన నాటి రాత్రి మెయిలే ఎక్కి వచ్చాడు. స్నేహితులు ఎంత బలవంతం పెట్టినా ఆగకుండా- ఏ మంజుల కోసం వచ్చాడో ఆ మంజులే తనలో ఉన్న ప్రతి శక్తినీ లాగేసుకుంది! మంజులకు ఇంత శక్తి వుందని తను ఎన్నడూ కలలో కూడా

తలచలేదు! ఏ రాత్రి నుంచీ జీవిత మాధుర్యాన్ని ఆఘ్రాణించేందుకు సిద్ధపడ్డాడో, ఏ క్షణం నుంచీ తన జీవిత సౌఖ్యానికి మధురతమక్షణాలు ఆరంభమౌతయ్యని తలిచాడో ఆ రాత్రి నుంచే విషాద జ్వాలల్లో తన జీవితం నలిగిపోసాగింది. ఏ మంజుల తన జీవిత పథానికి తోడునీడై వుంటుందని తలిచాడో- ఆమె కంటక రూపంలో తనను అన్నివైపులా ప్రతిఘటించింది. కాలచక్రానికి ఉన్న మహత్తర శక్తుల్లో యిది కూడా వొకటని కాళీ గ్రహించాడు.

మంజుల రూపు జ్ఞాపకానికి వచ్చినప్పుడు కాళీకి తను గుడ్డివాడై వుంటే ఎంత బాగుండునో అనిపించేది. ఆమె మాటల్లో కూడా అతనికి మాధుర్యం కనిపించేది కాదు. ఈ వ్యక్తితో తను జీవితాన్ని గడపటం ఎట్లాగో కాళీకి అగమ్యగోచరంగా వుంది. ఒంటరిగా ఇంట్లో కూర్చొని ఏదో ఆలోచిస్తూ వుండేవాడు. ఏది ఆలోచిస్తున్నా ఆ ఆలోచన మంజుల వైపే మళ్లేది. అప్పుడు తనకు భూమ్యాకాశాలు ఏకమౌతున్నట్టు తోచేది. అధికమైన కోపం వచ్చి- ఆ చేతకాని కోపం తననే ఏడిపించేది. ఆలోచనా పర్యవసానం తలగడా తడవటంగా మారేది. ఇది చూసి కాళీ, తనంత దుర్బల హృదయుడెందుకవ్వాలనే రోషంతో సిగ్గుపడేవాడు. మంజులను మరిచిపొయ్యే శక్తి తనలో వుంటే అతనికి కొంత మనశ్శాంతి వుండేది కాని, తన ఇంట్లో తన కళ్ళఎదుట తిరుగాడుతూన్న తన ధర్మపత్నిని ఎల్లా మరిచిపోగలడు?

కాలు కాలిన పిల్లిలాగు ఇంట్లో తిరుగులాడటం విసుగుపుట్టి స్నేహితుల ఇళ్ళకు వెళ్ళి లోకాభిరామాయణ పారాయణలో పడేవాడు. అదైనా అతనికి తృప్తికరంగా ఉండేది కాదు. ఎన్ని వినోద ప్రదర్శనాలకు వెళ్లినా, ఎన్ని పుస్తకాలు చదివినా కాలం మాత్రం దాని వేగాన్ని హెచ్చించదు.

ఒక్క ధనవంతులే యీ లోకాన్ని స్వర్గసమానంగా భావిస్తున్నారనే విషయం కాళీ జీవితంలో మిథ్యగా పరిణమించింది. ఎంత డబ్బు వున్నా తను జీవితానందానికీ, మనశ్శాంతికీ నోచుకోకుండా చెయ్యగలిగింది-- 'అబల' అనబడే ఒక స్త్రీ!

అధమం గడిచిన జీవితాన్ని మరిచిపోగలిగితే కాళీ కొంతవరకూ అదృష్ట వంతుడయ్యేవాడు. కాని ఇది సాధ్యమైతే లోకం ఇంత కష్టభూయిష్ఠంగా ఉండేది కాదేమో? చిన్నతనం నుంచీ ఏ ఇల్లు అతనికి ఆనందభవనమైందో ఆ ఇల్లే ఇప్పుడూ ఇకముందూ కూడా నరకసమానం! మంజుల రూపానికి ఏ బల్లేలకున్న పదును వుందో కాని, కాళీ హృదయంలో కనపడని గాయాన్ని చెయ్యగలిగింది. ఎన్ని రోజులు గడిచినా ఆ గాయం మానుముఖం పడుతుందనే నమ్మకం లేదు.

కాళీ జీవితం పూర్తిగా తెలిసింది-- ఆ ఒక్క గోపాలానికే! తక్కిన వాళ్ళు కాలక్షేపానికి పనికివచ్చే స్నేహితులనీ, గోపాలం ఒక్కడే 'మిత్రుడు' అనే పదానికి అర్హుడనీ కాళీ అభిప్రాయం.

కాళీలోని యీ మార్పులన్నింటినీ సమగ్రంగా గ్రహించిన గోపాలం ఒకసారి, "ఆమె నీ జీవితాన్ని పాడుచేసేందుకే దాపరించినట్టుంది" అన్నాడు, ధైర్యం చేసి.

"నేను కూడా అల్లాగే అనుకుంటున్నా--"

"అనుకొని ఏం లాభం? నీ జీవితాన్ని బాగుచేసుకోవటం నీ విధి."

"అది నాకు తెలుసు. కాని చేతులు కాలాక ఆకులు పట్టుకొని ఏం ప్రయోజనం? ఇప్పుడు ఏం చేసినా లాభంలేదు."

"ఎందుకు లేదు? మరో వివాహం చేసుకో--"

కాళీ నవ్వి, "భార్య బతికి వుండగానే మరో వివాహమా? నలుగురూ నవ్వుతారు. పోనీ నేను వివాహం చేసుకొని హాయిగా వుంటే ఆమె గతి ఏం కాను? పురుషుడు ఎన్ని వివాహాలు చేసుకున్నా అతని శీలానికి భంగం లేదు కాని, ఆ హక్కు స్త్రీకి లేదుగా! అయినా ఒక భార్య బతికి వుందని తెలిసి కూడా ఇంకొకరు పిల్ల నిచ్చేందుకు సాహసించరనుకుంటా--" అన్నాడు.

గోపాలం గంభీరంగా అన్నాడు: "నీకు పిల్లనిచ్చేవాళ్ళే యీ లోకంలో లేరంటావా? వయస్సు చెల్లిన దద్దమ్మలకూ, భార్యను కూడా పోషించే శక్తి లేని వెధవలకు కూడా పిల్లల్నిచ్చే కల్పతరువుల్లాటి పెద్దమనుషులున్న యీ సంఘంలో నీలాటి యువకుడికీ, విజ్ఞానవంతుడికీ, ముఖ్యంగా భాగ్యవంతుడికీ పిల్లనిచ్చేవాళ్ళే కరువౌతారా? తల్లికోసం భార్యకోసం నీ ఆనందాన్ని పాడు చేసుకోవాలా? ఈ లోకంలో ఒకరి జీవితానికి వేరొకరు ఎప్పుడూ జవాబుదారీ అవరుగా!"

"అయితే ఆమె జీవితాన్ని పాడు చెయ్యమంటావా?"

"నువ్వు పాడుచేసేదేమిటి? మనం పాడుచెయ్యాలన్నా సాధ్యపడకపోవచ్చు. పోనీ, నువ్విప్పుడు చేస్తూన్న దేమిటి? ఆమె జీవితాన్ని బాగుచేస్తున్నావా? ఆమెను సౌఖ్యపెడుతున్నావా?"

కాళీకి యీ మాటల్లో ఎంతో కఠినత్వం వుందని తెలుసు. కాని గోపాలం చెప్పింది మాత్రం నిజం! తన జీవితాన్ని ఎల్లా పాడు చేసుకుంటున్నాడో తనకు తెలియకుండానే ఆమె జీవితాన్ని కూడా పాడు చేస్తున్నాడు. బహుశా ఆమె సౌందర్యాన్ని అపహరించిన విధే ఇద్దరి జీవితాల్నీ పాడు చేస్తున్నాడేమో!

కాళీ చెమ్మగిలిన కళ్లను తుడుచుకోవటం చూసి గోపాలం మళ్లీ అందుకున్నాడు: "ఈ విషయం ఎన్నాళ్లు ఆలోచించినా సమస్య భీకర రూపం దాల్చటం తప్ప ఎప్పటికీ పరిష్కరించబడదు. మందులేని మనోబాధతో వేగిపోవటం దేనికి? ఆమె జీవితం ఎప్పుడో పాడైపోయింది. పోతే నీ జీవితాన్ని బాగుచేసుకొనే అవకాశాన్ని ఎందుకు వృథాచెయ్యాలి? ఇది స్వార్థమే అయినా దీన్ని నిర్వర్తించటం నీ విధి--"

"ఈ సంఘంలో నాకున్న అధికారం ఆమెకు ఎందుకు లేదు? పాపం ఆమెను చూస్తే నాకు జాలి కలుగుతుంది..." గోపాలం చేతుల్ని ఊపుతూ సాగించాడు: "గోపీ! నీతో చెప్తున్నాను. పాపం! ఆమె ఎప్పుడూ ఎవర్నీ ఒక్కమాట కూడా అని ఎరుగదు. ఇంట్లో అధికారాన్ని చలాయించాలని కూడా ఆమెకు లేదు. నౌకర్లు తప్పు చేసినా వాళ్ళను యేమీ అనదు. అందుకనే వాళ్ళకు నిర్లక్ష్యతా, అలుసూ, సోమరితనమూ ఎక్కువయ్యాయ్. అసలు ఆమె తను యీ లోకం వ్యక్తి కాదన్నట్టుగా ప్రవర్తిస్తుంది. నా కంటపడితే నేను బాధపడతానని ఎప్పుడూ తప్పుకు తిరుగుతుంది. అనవసరంగా నాతో కూడా ఏ విషయాన్నీ మాట్లాడదు. ఈ వారం రోజుల్లోనే ఆమె ఏదో గొప్ప తప్పు చేసినదానిలాగు ప్రవర్తిస్తోందన్న విషయాన్ని నేను దృఢంగా గ్రహించగలిగాను. నా జీవితానికి హృదయపూర్వకంగా కన్నీరు కార్చే వ్యక్తుల్లో ఆమె మొదటిది అనుకుంటా. ఏ జీవికీ అపకారం చెయ్యని వ్యక్తిని ఎట్లా కష్టపెట్టేది? ఆమె రూపులో ఇంత భేదం వున్నా ఆమె హృదయానికీ, ఆత్మకూ ఆ స్ఫోటకం ఏ మాత్రమూ అంటలేదు! ఈ కళ్లే నన్ను మోసం చెయ్యకుండా వుంటే ఆమెను మానవమాత్రురాలిగా కాదు నా జీవితానికి వెలుగు చూపేందుకు వచ్చిన దేవభామినిగా భావించి వుందును...." కాళీ ఉద్రేకంతో చెప్పిన యీ మాటలకు అతని గొంతులోనే దుఃఖతరంగాలు లేచినయ్.

"పిచ్చివాడా! ఆమె జీవితాన్ని పాడుచెయ్యమని ఎవ్వరూ చెప్పరు. నీకు సాధ్యమైతే ఆమె జీవితాన్ని బాగుచెయ్..."

కాళీ "ఎట్లా?" అన్నాడు ఆతురతతో.

"ఏ కాలచక్రం మిమ్ము విడదీయ్యగలిగిందో ఆ కాలచక్రమే మళ్ళీ మిమ్ము ఏకం చెయ్యలేదా? ఆమెను ప్రేమించేందుకు ప్రయత్నించు. మనోబలం వుంటే- ఎంతటి హృదయ పరివర్తనైనా సాధ్యమౌతుంది."

"ఆమెనా? ఇదివరకు అనేకసార్లు ప్రయత్నించాను. నాలో ఏ శక్తీ నాకు సహాయపడలేదు. ఆమె రూపు కన్పించినప్పుడూ, నేను ఊహించుకున్నప్పుడూ నా బుర్ర తిరిగిపోతుంది. ఇది మాత్రం నా తరం కాదు--" కాళీ దాదాపు నిరాశతోనే యీ మాటల్ని అన్నాడు.

కాళీ నిరుత్సాహాన్ని నెట్టేందుకు- అతని వీపును తట్టుతూ గోపాలం, "ఐతే ఒక్క సౌందర్యాన్నేనా మనం ప్రేమించేది?" అన్నాడు.

"కాక?"

"అయితే నీ భార్యకన్న అందకత్తెలే యీ లోకంలో లేరా? ఉంటే వారందర్నీ నువ్వు ప్రేమిస్తున్నావా?"

ఈ ప్రశ్న ఆలోచించదగ్గదే! ఈ లోకంలో తన భార్యకన్న సౌందర్యవంతులు ఎంతమంది లేరు! వాళ్లందర్నీ తను ప్రేమించటంలేదే!

"ఏం--చెప్పు--"

"లే-దు"

"అంతే! ఒక్క సౌందర్యాన్నే కాదు మనం ప్రేమించేది! అనేకం ఉండొచ్చు. సౌందర్యం మాత్రం మన కళ్లను మోసపుచ్చే వాటిలో ఒకటి. దానికి లొంగకుండా వుండటమే విజ్ఞానవంతుల లక్షణం!"

సమాధానం చెప్పకుండా కాళీ ఆలోచనలో పడ్డాడు. ఇప్పుడు యీ సమస్య పరిష్కరింపబడే ఛాయలు అతనికి గోచరమౌతున్నయ్. కాని వాటిని ఆచరణలో పెట్టగలదా తన మానవ హృదయం? ఒక్క మాటల్తోనే హృదయ పరివర్తన సాధ్యమైతే యీ లోకంలో కొరగాని జీవితాలు కొన్ని కోట్లు బాగుపడి ఉండేవి!

కొంచెం ఆలోచించి గోపాలం పెద్ద స్థాయిలో, "ఇది చివరి ప్రశ్న. దీనికి సమాధానం చెప్పు--" అన్నాడు.

"ఏమిటీ?"

"ఒకవేళ ఆమె చెందిన వికారం- నీకు దాపరించిందనుకో! నిన్ను నీ భార్య ప్రేమించగలదా? అప్పుడు నువ్వెలా 'ఛీ'లయ్యేవాడివి? సౌందర్యాన్ని ఒక్కదాన్నే ప్రేమించగల మూఢులందరూ అంతే! నువ్వెంత హృదయవేదనకు గురయ్యావో నీ భార్య కూడా అంతేగా! ఏదైనా తన దాకా వస్తేనేకాని తెలిసి రాదు! కనీసం నువ్వీ సంఘటనను ఊహించి చూడు--"

గోపాలం చెప్పింది కాచివడబోసిన సత్యం! అతని మాటలకు గాలిలో కలిసి కరిగిపోయే శక్తి లేదు. హృదయంలో పరివర్తనార్థం జరిగే పోరాటానికి దోహదమయ్యే శక్తి వుంది! కాళీ బుర్రలో భూతాలు నాట్యం చేస్తూన్నట్టు తోచింది. ఎన్నడూ తను ఆలోచించలేని విషయాల్ని ఎన్నింటినో గోపాలం చెప్పాడు. పైకి అవి తన హృదయాన్ని గాయపరిచినా శాంతంగా ఆలోచిస్తే ఆ మాటలకున్న శక్తి వ్యక్తమౌతుంది.

"ఇవన్నీ ఆలోచించు...ఏదో ఒకటి తేల్చుకో. నీకు నా మాటలు కష్టంగా తోచినా చెప్పటం నా విధి అని తలచాను--"

కాళీ కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి.

"ఆలోచిస్తాను--" అని మెల్లిగా లేచి నిలబడ్డాడు. తన మాటలు స్నేహితుడి హృదయంలో ఘాటుగా నాటుకున్నందుకు- తన కృషి కొంతవరకూ ఫలించిందని గోపీ సంతోషపడ్డాడు. అవి క్రియారూపంకూడా దాల్చితే తన విధ్యుక్తధర్మం పూర్తిగా సాఫల్యత పొందుతుందని తలిచాడు.

నవ్వుతూ లేచి కాళీని సాగనంపాడు. కాళీ దృష్టిపథంలోంచి నిష్క్రమించగానే, 'అమాయకుడు: లోకానుభవమే కొద్ది; ఉన్నదాన్నయినా సరిగ్గా ఆచరణలో పెట్టుకోలేడు.

మామూలు మానవ హృదయాల్లో కన్న దౌర్బల్యత ఇంత ఎక్కువ మోతాదుల్లో ఇతనిలో ప్రత్యక్షమవటమే శోచనీయం' అనుకున్నాడు.

## 4

"దేవదాస్--చదివావా?"

"ఆఁ." అని తల వూపింది--మంజుల.

"నీ కళ్ళవెంట నీళ్ళు రాలా?"

"లే--దు."

తలచినట్టుగా సమాధానం రాకపోవటం వల్ల కాళీ కొంచెం నిరుత్సాహపడ్డాడు. "సర్వాబద్ధం! బహుశా శరత్ కూడా అది రాస్తూన్నప్పుడు ఏడ్చి వుండాలి..."

ఆమె నవ్వి, "ఐతే కథలో వచ్చే కాల్పనిక పాత్రలక్కూడా ఏడవాలా?" అంది.

"పాత్రలు ఏడిపించేవైతే--ఏడవ్వొద్దూ?"

"కాల్పనిక పాత్రలకే కళ్లనీళ్లు పెట్టే హృదయాలున్నవాళ్లు నిజంగా అల్లాటి వ్యక్తులే మన చుట్టూ తిరుగుతూన్నప్పుడు వార్ని గూర్చి కంటతడి పెట్టవద్దూ..."

"తప్పకుండా--"

"అది చాలా అరుదనుకుంటాను"

కాళీ ముఖం చిట్లించి, "ఎందుకని?" అని అడిగాడు.

"రచయిత శిల్పాన్ని ఆధారం చేసుకొని ఏడిపిస్తాడు; కాని వ్యక్తులందరికీ ఆ శిల్పచాతుర్యం ఉండదుగా!...నేను వేరే దీనికి సమాధానం చెప్పటం అనవసరం..."

కాళీకి ఇది అర్థమవకపోలేదు. ఒకరి కష్టాలకు వేరొకరు హృదయపూర్వక బాష్పాల్ని వృథా చెయ్యరు. తన కళ్ల ఎదుట దుర్భర జీవితానికి గురవుతూన్న మంజులే అందుకు ప్రత్యక్ష నిదర్శనం! నవ్వుతూ మాట్లాడే శక్తికానీ, తనను నవ్వించగల శక్తికానీ మంజులలో ఇప్పుడు లేదనీ, ఇకముందు ఉండదనీ కూడా కాళీకి తెలుసు! శిల్పంలేని ఏమీ చేతకాని- యీ మంజుల తనను లోబర్చుకోగలదనీ, తనకు మనశ్శాంతిని ఇవ్వగలదనీ తను ఎల్లా ఊహించుకుంటాడు? ఈ పది రోజుల్నుంచీ తనలోనూ, భార్యలోనూ ప్రబలిన 'సీరియస్ నెస్' తనకు తెలియకపోతేగా?

కాళీ నిట్టూర్చి, "ఆ దేవదాస్ బ్రహ్మచారై జీవితాన్ని పాడుచేసుకొన్నాడు. నేను గృహస్థునై పాడుచేసుకొన్నాను. ఇంత భేదం!" అని తగ్గుస్థాయిలో అన్నాడు.

కాళీ మాటలకే కత్తులకున్న పదునువుంటే మంజుల మృతశరీరం నేలవ్రాలి వుండేది. జీవచ్ఛవంగా మారిన తనను యీ మాటలు ఇంకా చావబాదుతున్నయ్.

తన భర్త బాధ తనకు తెలుసు కనుకనే మనసు ఎంత గాయపడ్డా మంజుల ఏ భావాన్నీ ప్రకటించకుండా గంభీరంగా నిలబడ గలిగింది.

"నాది వొక్క కోర్కె వుంది. దాన్ని తీర్చండి–"

"ఏమిటది?"

"నా కోసం మీరు జీవితాన్ని పాడుచేసుకోవటం దేనికి? నేను పుట్టింటికి వెళ్లిపోతాను. మీరు మరో వివాహం చేసుకోండి. ఇది సామాన్యంగా స్త్రీ సమ్మతించని విషయమే కావచ్చు. కాని యీ మాటలు నా హృదయంలోని లోతైన తావు నుంచి వెలువడ్డయ్. మీ జీవిత సౌఖ్యానికి అడ్డుపడటానికి తప్ప నా జీవితం మరెందుకూ పనికిరాదు. మీరు కాదనకండి...నాలో ఈర్ష్యకు తావులేదు..."

కాళీకి మంజులలో తను ఎన్నడూ గ్రహించని దివ్యత్వం స్ఫురించింది. తను ఆమెను ఎంత హీనంగా మాట్లాడుతున్నాడు! ఆత్మాభిమానమనేది కూడా మంజులలో మాయమైందేమో! తన సౌఖ్యం కోసం ఆమె తన భార్యాత్వాన్నిక్కూడా బలి ఇచ్చేందుకు సిద్ధపడ్డది. ఇలాటి స్త్రీలు కూడా లోకంలో ఉన్నారనే విషయం కాళీకి యీనాడు తెలిసింది. ఆమె ఔదార్యం అతన్ని ఆశ్చర్య పరిచింది.

ఆమెను పరికించి చూసిన కాళీకి ఆమె నిశ్చలంగా నిలబడి వుండటం మరింత ఆశ్చర్యపెట్టింది. వాతావరణంలోని మార్పుకు చలించని మానవహృదయం కనీసం అల్లా కన్పించని వ్యక్తిత్వం ఈమెకు ఏ దేవతలు ప్రసాదించారో ననిపించింది. ఆమె ప్రశాంత దృక్కులు తనను నిలవదీసి ప్రశ్నిస్తూన్నట్టున్నాయ్. ఈ నిరపరాధికేనా తను కృతఘ్నత చూపవలసింది? ఆ వికృతాకారాన్ని తను జన్మలో ప్రేమించ లేననే దృఢనిశ్చయం కాళీని వదలటంలేదు. ఇన్ని విషయాలూ తెలిసి తను వెనకాడటం– ఇది మానవ సహజమే అవ్వొచ్చు!

భర్త మాట్లాడకపోవటం చూసి మంజుల "నాకు తేల్చి చెప్పండి--" అంది.

కాళీ ఆ స్థలంలో ఇంకొక్క క్షణం కూడా నిలువలేకపొయ్యాడు. దేవవర్చస్సును చూడలేని మానవ నేత్రాలు పొందే బాధ ఆ క్షణాన అతనికి అర్థమై వుంటుంది.

"ఆలోచిస్తాను--" ఎల్లాగో యీ మాటను అని కాళీ గిరుక్కున తిరిగి వెళ్లి పొయ్యాడు. మంజుల మాత్రం నిట్టూర్చి ఇంకా అల్లాగే నిలబడి పోయింది.

## 5

కొడుకులో అనేక మార్పుల్ని కనిపెట్టిన తల్లిమనస్సు మనస్సులో ఉండేది కాదు. రాత్రులు తనతో కూడా మేడ కింది భాగంలో నిద్రిస్తూన్న కోడల్ని చూసి మొదట్లో ఊరుకున్నా ఇప్పుడు మందలించవలసి వచ్చింది.

"వాడు రోజు రోజుకూ చిక్కిపోతున్నాడు. వాడి ఆరోగ్యం సరిగ్గా లేదేమోనని కూడా నా అనుమానం. భోజనం సరిగ్గా చెయ్యడు. దుస్తులు మార్చుకోవటంలోనూ శుభ్రంగా ఉండటంలోనూ- ఇతర కాలకృత్యాల్లోనూ వాడికి శ్రద్ధపోయింది. ఇంటికి ఎప్పుడు వస్తాడో, ఎప్పుడు పోతాడో కూడా తెలియదు. ఇదంతా చూడబోతే ఏదో పెద్ద మనోవ్యాధితో కుంగి పోతున్నాడేమో ననిపిస్తోంది. లేక లేక పుట్టిన వాడి మీదే నా పంచప్రాణాలు ఉన్నై. వాణ్ని చూసినప్పుడల్లా పిచ్చివాడుగా మారుతున్నాడనిపిస్తోంది నువ్వు ఇక్కడెందుకు పడుకుంటావు? వాడితో చెప్పమ్మా- నీ తల్లి దిగులుపడుతోందని. వాడు సరిగ్గా అన్నం తినకపోతే నాకు మాత్రం సయిస్తుందా తల్లీ? వాడి మనస్సును బాగుచేసే ఉపాయాన్ని ఆలోచించు. నీకు అన్నివిధాలా స్వాతంత్ర్యం వుంది. నేను ఎన్నిసార్లు అడిగినా లేని నవ్వును కల్పించుకుంటూ, 'ఏం లేదమ్మా!' అంటాడు. ముసలిదాన్ని అవుతూన్నకొద్దీ నాక్కూడా హృదయ భారం అధికమౌతోంది..."

అత్తగారి మాటలకు మంజుల, 'మీ శాంతిమయ జీవితానికి చిచ్చుపెట్టింది--నేనే!' అనుకొంది.

"వాడు చిన్నవాడు. నిన్ను ఏమన్నా ఊరుకో తల్లీ. తెలియక నీ మీద కోప గించుకోవచ్చు. దంపతుల్లో ఇల్లాటి ప్రణయకలహాలు సహజమేగా! ఎల్లాగైనా వాణ్ని నొప్పించకుండా ఉండు...."

బహుశా తను భర్తతో కలహించివుంటుందని అత్తగారు అపోహపడ్డది. కాని తనే వారింటి శత్రువని ఆ ముసలమ్మకేం తెలుసు?

"ఈ వ్యవహారం నాకు బాధ కలిగిస్తోందిలే తల్లీ... పోనీ... నా కోసం వెళ్ళు. భార్యాభర్తల కోపం ఎంతకాలం వుంటుంది? వెళ్లి నువ్వు.... వాడు కూడా నవ్వుతాడు...సరిపోతుంది...."

అత్తగారిచేత బతిమాలించుకోవటం మంజులకు చాలా కష్టంగా తోచింది. ఆమె దీనమైన మాటలు తన హృదయాన్ని కలచివేసినై. ఆమె తృప్తి కోసమైనా తను మేడమీదికి వెళ్ళాలి. తల్లీ కొడుకుల్ని ఇద్దర్నీ కష్టపెట్టవలసి వచ్చినందుకు మంజుల తనను తను తిట్టుకుంది.

మెల్లిగా లేచి తప్పటడుగులు వేసుకుంటూ మేడమెట్లెక్కుతూన్న మంజులకు ఒక్కొక్క మెట్టు, ఒక్కొక్క పర్వతంలాగు వుంది. ద్వారం దగ్గర నిలిచి గదిలోకి చూసింది. భర్త ఏదో బొమ్మను చూస్తున్నాడు. అది ఏమైవుంటుందో తెలుసుకోవాలనే వాంఛతో వేళ్ళమీద నడుచుకుంటూ వెళ్లి భర్త వెనకాల నిలబడ్డది.

భర్త చూస్తూన్నది తన ఫోటోయేనని తెలిసి మంజుల కొద్ది ఆశ్చర్యానికి గురైంది. ఆ ఫోటో... తను కాపరానికి వచ్చిన కొత్తలోది. అప్పుడు తను ఎంత అందంగా వుండేది! భర్త కంటివెంట నీరు కారుతోంది. ఆ యువకుడి హృదయంలో ఆరని

చిచ్చునూ, తీరని తమస్సునూ జొనిపి అతన్ని అధఃపతితుడిగా తయారుచెయ్యగల తన రాక్షసత్వానికి ఎంత శక్తి వుందో! పాపం అతనేం తప్పు చేశాడు? తను మాత్రం ఏం తప్పు చేసింది?

వెనకాల ఎవరో మనిషి వున్నట్టు అనుమానం తగిలి ఉలిక్కిపడి కాళీ వెనక్కు తిరిగి చూశాడు. ఆమె తన భార్యేనని తెలిసినప్పుడు కాళీ సిగ్గుపడి కన్నీళ్లను ఒత్తుకొని ఆ ఫోటోను మూసేశాడు.

"మంజూ! ఎందుకొచ్చావ్?"

ఆమె తల వొంచుకొని, "నా ఫోటో కూడా మిమ్మల్ని ఏడిపించ గలుగుతోంది. లోకంలో అతి సులభంగా కన్నీరు కార్చే వ్యక్తుల్లో మీరే ప్రథములుగా ఉన్నారు... ఆ ఫోటో ఇటివ్వండి చింపి పారేస్తా-- " అంది.

"ఇందుకేనా నువ్వొచ్చింది?"

"కాదులెండి--ముందు నేను అడిగినదానికి సమాధానం చెప్పండి--"

"ఫోటో వుంటే నిన్నేం చేసింది? అది నాకు కావాలి-"

మంజుల ఒక్క క్షణం ఆగి నిట్టూర్చి అంది, "మీ తల్లిగారు మిమ్ము గూర్చి చాలా కలవరపడుతున్నారు.... ఎంత వద్దన్నా బలవంతపరిచి నన్ను పైకి తరిమారు..."

కాళీ నవ్వుతూ "ఇక్కడ పడుకుంటావా?" అన్నాడు.

"మీ ఆజ్ఞ అయితే--"

అమాయకపు మంజుల తనను తనే ఎంత హీనంగా చూసుకుంటోంది!

"సరే--పడుకో."

ఆమె మాట్లాడకుండా వెళ్ళి నేలమీద పరిచివున్న తివాచీ మీద మేనువాల్చింది. ఈ దృశ్యాన్ని చూసిన కాళీ 'ఆత్మాభిమానం లేని స్త్రీ యీమె ఒక్కతేనా?' అన్నట్టు ఆశ్చర్యపడ్డాడు. మెల్లిగా ఆమె పక్కనే కూర్చొని, "మంజూ ఏమిటిది? పక్క వుండగా కిందపడుకోవటం దేనికి?" అన్నాడు.

"మరి మీరో?"

"నాకు నిద్ర రాదు. ఇంకా చాలాసేపు చదువుకోవాలి..."

ఆమె ఏదో ఆలోచించి అంది: "ఫరవాలేదులెండి. ఈ మంజుల ఎక్కడ పడుకున్నా అరగదు, కరగదు."

"నా మాట వినవూ? వినవూ?...."

భర్త చేత బతిమాలించుకోవటం ఆమెకు ఇష్టం లేదు. మాట్లాడకుండా వెళ్ళి మంచం మీద పడుకొని కన్ను మూసింది.

కాళీ తృప్తిపడ్డట్టు చూసి, ఏదో పుస్తకం విప్పి చదవ నారంభించాడు. చదువుతూన్నది ఏ మాత్రమూ బుర్రకు ఎక్కటం లేదు. దృష్టి మాత్రం అచ్చు పంక్తుల్ని తోసుకుపోతోంది. మంజుల తనకు సమీపంలోనే నిద్రిస్తోందన్న సంగతి జ్ఞాపకం వచ్చినప్పుడల్లా కాళీ కంపిస్తున్నాడు.

లేచి మెల్లిగా ఆమె పాన్పు దగ్గరకు వెళ్లాడు. మూసి వున్న ఆమె కళ్ళ వెంటకూడా నీరు కారుతోంది. అభాగ్య మంజుల స్వప్నంలో కూడా శాంతిలేక బాధపడుతోంది. లేక గంధర్వ గానాల్ని వింటూ ఆనంద బాష్పాల్ని రాలుస్తోందా? కాని, ఆ కమ్మని కలల్ని కనే కాలం వెనుకనే గడిచిపోయిందని కాళీకి తెలుసు.

అన్ని బాధల్నీ మరిచిపోయి నిద్రాదేవి కౌగిట్లోకి ఒరిగిన అమాయకపు మంజులకు కూడా ఏదో ద్రోహంచేస్తున్నట్టే కాళీ భావించాడు. దుర్భరావేదనతో ఇరవై నాలుగేసి గంటల రోజులు ఇంకెన్ని గడుస్తే తనకు ముక్తో?

ఆమె విడిచే నిట్టూర్పు గాడ్పులకు గదిలోని గాలంతా వెచ్చగా మారి వుంటుంది. ఆమె వెచ్చని కన్నీరు భూమిలో ఇంకి భూమాతనే దగ్ధంచేసి వుంటుంది! ఆమె పాతివ్రత్య ప్రభావానికే పూర్వపు శక్తులు వుంటే ప్రకృతే ఘోషించి తీరేది. ఏమైనా తన మనస్సును మార్చలేని మంజులలో ఈ శక్తులు ఎన్ని వున్నా వ్యర్థమే!

ఎంత తరచినా తరగని ఆలోచనా సాగరంలో పడి బుర్ర చెడగొట్టుకుంటూ కాళీ దాదాపు ఆ రాత్రంతా పడక కుర్చీలోనే గడిపాడు. బైట శశాంకుడు తనను గమనించకుండానే పారిపోతున్నాడు. ఇలాటి నిరుపయోగమైన వెన్నెల రాత్రులు ఇంకెన్నిటిని గడపాలో?

గడియారం లెక్కపెట్టుకుంటూ ఐదు గంటలు కొట్టాక కాని కాళీకి తను బాధపడ్డ నిమిషాల విలువ స్ఫురించనేలేదు.

మంజుల నిద్రలేచి, కళ్ళు నలుపుకుంటూ గడియారం వైపు చూసి, "మీరు కూడా ఇప్పుడే లేచారా?" అంది.

కాళీ బాధగా చేతులు విరుచుకుంటూ, "లేదు... నా కసలు నిద్ర పట్టలేదు..." అన్నాడు.

మంజుల ఆశ్చర్యపడి "ఇప్పటిదాకా మీరు మేలుకొనే ఉన్నారా? మీ ఆరోగ్యం చెడుతుందేమో! కళ్ళు చూడండి ఎర్రపడ్డయ్--" అంది.

"పడనీ... బుర్ర కూడా తిరుగుతోంది. నిశ్చింతగా నిద్ర పొయ్యే రాత్రులు నా జీవితంలో ఇకముందు రావు..."

కాళీకి శరీరం తూలిపోతూన్నట్టు తోచింది. కీళ్ళన్నీ పట్టుకుపోయి నాలుగు నిమిషాల్లో ఎక్కడలేని చలీ ఆవరించింది. గదిలో అతనికి కన్పించే ప్రతి వస్తువూ

గిరగిరా తిరుగుతోంది. కళ్ళు వాటంతట అవే మూసుకొనేందుకు ప్రయత్నిస్తున్నయ్. ఎంత ప్రయత్నించినా తనను తనే గుర్తించుకోలేకుండా ఉన్నట్టు తోచింది.

"మీరు తూలిపోతున్నారు ... పడుకోండి--" మంజుల అతన్ని ఎల్లాగో మంచం మీదికి జేర్చింది.

"మంజూ! దుప్పటి కప్పు--చలేస్తోంది--"

ఆమె దుప్పటి కప్పాక, "మంజూ! జ్వరం వొచ్చింది-" అన్నాడు.

ఆమె అతని శరీరం నిప్పుల్ని కక్కుతూండటం చూసి. "ఔను--మీరు మాట్లాడకుండా పడుకోండి. నేను కిందికి వెళ్తాను--" అంది.

కాళీ, 'సరే' అన్నట్టు తలవూపి పడుకున్నాడు.

మంజుల ఏదో ఆలోచిస్తూ మెల్లిగా మేడ మెట్లు దిగనారంభించింది.

## 6

ఉదయం తొమ్మిది గంటలైనా కొడుకు మేడదిగి రాకపోవటం చూసి, "అబ్బాయి ఇంకా నిద్ర లేవలేదా?" అని తల్లి అడిగింది.

"లేదు-వారికి జ్వరం వచ్చింది."

"ఎప్పుడు?"

"తెల్లవారుజామున--"

"పద పోయి చూద్దాం."

"నిద్రపోతున్నారు, లేవనీండి వెళ్దాం. డాక్టర్‌కోసం కబురంపాను."

తల్లిని ఏదో భయం ఆవరించి, "అప్పుడే అనుకున్నాను వాడి ఆరోగ్యం చెడుతోందని" అని నిట్టూర్చింది.

డాక్టరును వెంటపెట్టుకొని, అత్తా కోడళ్ళు ఇద్దరూ మేడమీదికి వెళ్ళారు; కాళీ ఇప్పటిక్కూడా నిద్రనుంచి లేవలేదు.

తల్లి "కాళీ!...కాళీ!" అని పిలిచి నిద్ర నుంచి లేపింది. కాళీ మెల్లగా కళ్లు తెరిచి అందరి వైపూ జాలిగా బాధగా చూశాడు.

డాక్టర్ రోగిని పరీక్షించి, "ఇది మలేరియా జ్వరం. ఇంటికి వెళ్లి మందు పంపుతాను" అని కిందికి దిగి వచ్చాడు. వివిధ ప్రశ్నలు వేస్తూ తల్లి మాత్రం కొడుకు దగ్గరే కూర్చుంది.

మంజుల కూడా మేడ దిగి వచ్చి ముందు వెళ్తూన్న డాక్టరును, "డాక్టరుగారూ!" అని పిలిచింది. డాక్టరు ఆగాడు.

"వారిది జ్వరమొక్కటే కాదనుకుంటాను--"

డాక్టరు తలతిప్పి, "అవును; జ్వరం వొక్కటే కాదు. ఒక్క రాత్రి జ్వరానికే మనిషి ఇలా నీరసించిపోడు. ఆయన ఏదో దీర్ఘమైన మనోవ్యాధికి గురయ్యాడనుకుంటాను--" అన్నాడు .

మంజుల వింటూ నిలబడ్డది.

"జ్వరం రెండు మూడు రోజుల్లో నిమ్మళించవచ్చు కాని ఆ మనోవ్యాధికి మాత్రం మందు లేదు.... ఆ బాధ మనిషిని కృంగదీస్తుంది. ఇక ముందన్నా చాలా జాగ్రత్త తీసుకోవటం అవసరం. ఆప్తులైనవాళ్ళు ఆయన మనస్సు కనిపెట్టి ప్రవర్తించాలి-"

మంజుల అంతా విన్నది. డాక్టర్ జారుకున్నాడు. సావిట్లోని సోఫాలో కూలబడి ఆలోచించసాగింది.

తనను గూర్చిన మనోవ్యాధి- భర్త ప్రాణానికే గురవుతోంది! తను జీవచ్ఛవమై యీ బాధల్ని భరిస్తూ బతికి తనకూ, మరి ఇద్దరు వ్యక్తులకూ ద్రోహం చేస్తోంది. తన భర్తను దాదాపు పిచ్చివాణ్ని చేసింది! అతని శాంతిమయ జీవితాన్ని భంగపరిచింది. 'నేనేం తప్పు చేశాను -- నేనేం తప్పు చేశాను?' అని తనను ప్రశ్నించుకుంది. తప్పులేకపోయినా ఏదో కనపడని అపరాధం జరుగుతూన్నట్టూ, తన పాపం బద్ధలైనట్టూ ఆమెకు స్ఫురించింది. తన నారీఛాయనుంచి వెలువడే జ్వాలల్లో భర్త నలిగిపోవటం తల్చుకున్నప్పుడు ఆమె వలవలా ఏడ్చింది. తను బ్రతికిఉన్నంత కాలమూ ఈ సమస్య పరిష్కరించబడదు! భర్తను సంతోషపెట్టేందుకు తనలో ఇప్పుడు ఏ శక్తీ లేదు!

అరగంట సేపు ఆలోచించి మంజుల ఒక నిశ్చయానికి రాగలిగింది. దాంతో ఆమె హృదయభారమంతా ఒక్క వేడినిట్టూర్పుతో బయటపడ్డది.

అత్తగారు కిందికి దిగి వచ్చి. "నిన్ను రమ్మంటున్నాడు వెళ్ళమ్మా!" అని చెప్పేదాకా మంజుల మళ్లీ ఆ యింట్లోని వ్యక్తి అవనేలేదు.

పైకి వెళ్లి భర్త ఎదుట నిలబడ్డది.

"మంజూ! నిన్ను చాలా బాధిస్తున్నాను సుమా!" అని కాళీ నిట్టూర్చాడు.

"కాదు--నేనే మీ మనోవ్యాధికి కారణం. ఈ తీరని సమస్యకు నేను యీనాడొక సూక్ష్మమార్గం కనిపెట్టగలిగాను--"

"ఏమిటది?"

"ఇప్పుడు చెప్పేది కాదు. ఇంకా కొద్ది రోజుల్లో దానంతటదే బైటపడుతుంది. మీరు అనవసరంగా దిగులుపడుతున్నారు..."

మంజుల లేచి అద్దం తీసుకు వచ్చి, భర్తకు చూపుతూ అంది: "చూడండి-మీరు పూర్వం ఎంత అందంగా ఉండేవారు! మీ కళ్ళు ఎంత కాంతివంతంగా వుండేవి! మీ ముఖంలో ఆరోగ్య జ్యోతి ఎల్లా ప్రకాశిస్తూ వుండేది! ఇప్పుడు చూసుకోండి మీ ముఖమంతా పాలిపోయి వాడిపోయింది. ఆ కళ్ళు ఎర్రబడి పూర్వపు తేజస్సునూ కాంతినీ కోల్పొయ్యాయి. దాని కంతకూ నేనే కారణం. అయినా ఇప్పుడా విషయం వొద్దు. మీ జ్వరం నిమ్మళించనీండి...."

మంజుల మాటల్లో సంగీతమూ, మాధుర్యమూ ఉన్నై అని కాళీ చెవులకు తెలుసు. ఆమె మాటలు తనను బంధించేస్తున్నై. ఏమైనా మనస్సు మాత్రం ఆమెవైపు మళ్ళదు. ఎందుకో దానికి అంత నిర్దయ!

మంజుల ఏదో మరిచిపోయి దాన్ని జ్ఞాపకం తెచ్చుకొని "ఇవ్వాళ మీ పరీక్షా ఫలితాలు వొచ్చాయ్" అంది.

కాళీ యా మాటల్ని విననట్టే చూస్తున్నాడు. తన మాటలకు అతని ఆదుర్దా ఎక్కువౌతుందనుకొన్న మంజులకు కాళీ ప్రవర్తన ఆశ్చర్యంగానే కన్పించింది.

గదిలోని నిశ్శబ్దతను తోసి పుచ్చుతూ మంజుల "మీరు రెండో తరగతిలో ప్యాసయ్యారు--" అంది.

ఈ మాటలకు కాళీ ముఖం వికాసాన్ని రూపిస్తుందనుకొంది అమాయకపు మంజుల! ఈ మాటలే కాదు ఇంతకన్న సంతోషకరమైన మాటల్ని చెప్పినా కాళీ సంతోషాన్ని ఇకముందు వెలిబుచ్చలేడని- ఇప్పుడు మంజుల తెలుసుకుంది.

కాళీ- 'ఈ బాహ్య ప్రపంచంలో నన్ను ఏదీ సంతోషపెట్టలేదు. ఎప్పటికీ నాకు మనశ్శాంతి వుండదు' అని తనలో తను అనుకున్నాడు.

"డాక్టర్ ఇంకా మందు పంపలేదా?"

"ఈ పాటికి వస్తూ ఉండొచ్చు--"

కాళీ- "చెమట పోస్తోంది" అని నీరసంగా మాట్లాడి చేత్తో విసురుకో సాగాడు.

మంజుల టేబిల్ ఫాన్‌ను తీసుకొచ్చి ప్లెగ్‌కు తగిలించింది. భర్తకు గాలి వచ్చేట్టు చేసింది.

"కింద నౌకరుగాణ్ని పిలు--"

"ఎందుకూ?"

"నడుం నొప్పిగా వుంది--"

"నేను గుద్దుతాను--"

మంజుల కాళీ నడుం గుద్దటం మొదలెట్టింది. కాళీ కొంచెం ఆశ్చర్యపడి, "ఇదేమిటి మంజూ! నీకు రోజు రోజుకూ మతిపోతూన్నట్టుంది--" అన్నాడు.

"మీరు చాలా సిగ్గుపడుతున్నారు. మీకు అధమం చేసే అధికారమన్నా నాకు వుందనుకున్నాను--" ఆమె కంఠంలోని దీనత్వం--అప్పటి కాళీలోని మిగతా శక్తులన్నింటినీ బంధించి వేయగలిగింది.

"భాగ్యవంతులందరూ సోమరిపోతులనుకునేవాణ్ని" అన్నాడు.

ఆమె, "వారు కూడా మనుషులేనన్న సంగతి మీ రప్పుడు మరచిపోయి వుంటారు--" అంది.

కాళీ గంభీరంగా ఊరుకున్నాడు. ఆమె తన పాదసేవకే సిద్ధమై యీ దాస్యపు బానిస బతుక్కు కూడా ఇష్టపడ్డదే! తన సౌఖ్యం కోసం, తన ఆనందం కోసం ప్రయత్నించి తన సుఖాల్లో భాగానికి నోచుకోకపోయినా కష్టాల్లో కావాలని కాలుపెడుతోంది! ఇల్లాటి ఇల్లాళ్ళను గూర్చి తను ఇదివరకు ఎక్కడా వినలేదు! కనలేదు! తనను వేరే వివాహం చేసుకోమన్నప్పుడే ఆమె మృదుహృదయం తనకు కొంతవరకూ అవగాహనమైంది. ఇప్పుడు ఆమె గాజుల చప్పుడు అతని చెవుల్లో ఉరిమిన శబ్దాల్ని చేస్తున్నాయి. హృదయంలో సూదుల్ని గుచ్చుతున్నాయి!

పది నిమిషాలు గడిచాక నౌకరు పైకి వచ్చి మందుసీసాను టేబిల్ మీద పెడుతూ, "ఈ పూట యేమీ పుచ్చుకోవద్దన్నారు. ఈ మందు రెండు సార్లు తాగాలట. సాయింత్రం మళ్ళీ ఆయనే వొస్తానన్నారు" అని చెప్పి చల్లగా జారాడు.

కాళీ, "ఇంక చాల్లే- మందివ్వు--" అన్నాడు.

మంజుల మందిచ్చాక తాగి, "వెధవ చేదు మందులు" అని కాళీ ముఖం చిట్లించాడు.

"మానవ జీవితమే చేదుమయం!"

కాళీ మాట్లాడకుండా గడియారం వైపు చూసి అప్పుడే అది పన్నెండు దాటిందని గ్రహించాడు. మంజుల మాత్రం తన పక్కనే బల్లమీద కూర్చొని శూన్యాకాశంలోకి చూస్తోంది.

"పోయి--భోంచెయ్యి."

"నాకు ఆకలి కావటంలేదు."

"నా దగ్గర అబద్ధమాడటం దేనికి? ఇప్పుడు నా కోసం కాచుక్కూర్చోవలసిన అవసరం కూడా లేదు. వెళ్ళిరా."

ఆమె మాట్లాడకుండా కూర్చుంది.

కాళీ ఆమె చెదిరిన ముంగురుల్ని పైకి తోస్తూ, "పో. నాకోసం వెళ్ళు" అన్నాడు.

"నన్ను బతిమాలకండి."

ఇద్దరూ ఒకర్ని వొకరు రెండు నిమిషాలపాటు చూసుకున్నారు. వారి చూపులకు పదును వుందో లేదో కాని ఇద్దరి కళ్ళూ నీళ్ళతో నిండినయ్.

"మనం--ఒకళ్ల నొకళ్ళం ఏడిపించుకునేందుకే జన్మించాం--." అని కాళీ గొణిగాడు.

ఆమె బుర్రగిర్రున తిరిగింది. ఏదో చెప్పరాని బాధతో కళ్ళను గట్టిగా మూసుకుంది. అంతా అంధకార బంధురం! ఏ కాంతి కిరణమూ ఆమెకు గోచరమనలేదు. తను ఉప్పటికీ అధఃపతితే!

కాళీ ఇదేమీ గమనించకుండా, "భోంచెయ్యకుండా సత్యాగ్రహం దేనికి?" అన్నాడు.

ఇక మంజుల సహించలేక పోయింది! తను ఏం చేసినా అది తప్పుగానే పరిగణింపబడుతోంది! ధైర్యంగా ఏ భావాన్నీ ముఖంలో కన్పించనీకుండా నోరు మెదల్పకుండా- ఆమె కిందికి దిగిపోయింది.

కాళీ నిశ్చింతగా నిట్టూర్చాడు.

## 7

"ఈ రోజు పత్యం పెట్టవచ్చు" అన్న డాక్టర్ మాటలు కాళీ చెవుల్లో ఇంకా రింగురింగుమంటూనే ఉన్నై.

"మంజూ డాక్టర్ చెప్పింది మరిచిపొయ్యేవ్?" అన్నాడు.

ఆమె నవ్వి "అంత సులభంగా మరిచిపోగలిగే శక్తి మానవుల్లో ఉండదుగా!" అంది.

కాళీ ఏమీ మాట్లాడలేదు. మంజుల తల వొంచుకొని నేల చూపులు చూస్తూ ఏదో ఆలోచిస్తోంది. ఆమె ముఖంలో భావమైతే కాళీకి తెలియలేదు కాని వారం నుంచీ తను జ్వరం పడ్డప్పటి నుంచీ, ఆమె ఏదో దీర్ఘాలోచనలో నిమగ్నమై వుందని మాత్రం అతను గ్రహించకపోలేదు.

తన జ్వరంలో ఆమె చేసిన సపర్యకు తను ఎన్ని జన్మలెత్తి కృతజ్ఞుడవ్వాలో? ఏది కావాలన్నా తను అడక్కముందే హాజరుపరిచింది. ఆమెకు యీ లోకంలో తనకన్న ఆప్తులు లేనట్టు ప్రర్తించింది. ఆమె రూపు తనను ఎంతగా బాధించిందో ఆమె ప్రవర్తనా, ఆదరాభిమానాలు అంత సుఖపెట్టినై. ఒకే వ్యక్తిలో ఇమిడివుండే రెండు భేదమైన శక్తులు ఇల్లాంటివేనేమో? ఏమైతేనేం తను ఆమెను, ఆమె యవ్వనాన్నీ, ఆయువునూ

నిర్లక్ష్యంగా, నిర్దయగా నలిపి పారేస్తున్నాడు. ఎంత సమాధానపరుచుకున్నా ఆమెను ప్రేమించలేక పోతున్నాడు. ఇది ఎప్పుడూ ఆలోచించే విషయమే! కాని ఇందులో తన తప్పు ఎక్కడో తెలియటంలేదు. ఆమె రూపు పైకి ఎంత వక్రమో, ఆమె ఆత్మ అంత సౌందర్యమైంది. కాని ఆత్మల్ని ప్రేమించటం యీ లోకంలో యీ మానవులకు చేతకాని విషయమని అతనికీ తెలుసు!

మంజులను చూస్తే ఎంత జాలి! ఆమె ముఖం మీది కుంకుమబొట్టు స్వేదబిందువులకు చెల్లా చెదరైంది. కాళీ ఆ బొట్టును బ్రొటనవేలితో తుడుస్తూ. "ఇది నీకు ఉన్నా ఒకటే- లేకున్నా ఒకటే!" అన్నాడు.

ఆమె ఆశ్చర్యపడి చూస్తోంది.

"మంజూ! నేను జీవించివుండి నిన్ను కష్టపెడుతున్నాను. ఆ జ్వరంలోనే చచ్చినట్లు..."

కాళీ మాట పూర్తికాకపూర్వమే అతని నోటిని తన చేత్తో మూసి, "ఇవ్వేనా మీరు అనాల్సిన మాటలు? ఇల్లాటి మాటల్తో నన్ను చంపేస్తున్నారు. మీ మాటల భారానికి నా హృదయం కృంగి కృశించిపోతోంది..." ఉద్రేకంలో ఇంకేమేమో చెప్పబోయింది కాని, హృదయాన్ని తోసుకుని వచ్చిన దుఃఖం గొంతువరకూ వచ్చి అడ్డుపడ్డది.

అర చేతుల్తో ముఖాన్ని మూసుకొని వలవలా ఏడుస్తూన్న మంజులను చూసి కాళీ పశ్చాత్తాపపడ్డాడు.

"మంజూ! నిజంగా నాకు నిన్ను కష్టపెట్టాలని లేదు. నా మాటల్లో ఇంత విషముందని కూడా నాకు తెలియదు. నన్ను క్షమించు... ఏం?... క్షమిస్తావా?.... చెప్పు..." కాళీ ఆమెను బతిమలాడసాగాడు.

"నన్ను మొగమాటపెట్టకండి..." ఎర్రబడ్డ కళ్ళతో ఆమె మేడ దిగిపోయింది.

'ఆడదాని హృదయంలో ఎంత జాలివుందో అంత కఠినత్వమూ వుంది. ఎంత నవనీతం వుందో...అంత పాషాణమూ వుంది' ఇదీ యీ క్షణాన కాళీ గ్రహించిన పాఠం.

తలెత్తి ద్వారం దగ్గర నిలబడ్డ గోపాలాన్ని చూసి - లేని మందహాసాన్ని కల్పించుకుంటూ, "రా! అక్కడే నిలబడ్డావేం?" అన్నాడు--కాళీ!

గోపాలం కుర్చీలో కూలబడి, "కాళీ! నువ్వు రోజు రోజుకూ పిచ్చివాడివై పోతున్నావ్. పూర్వం నీలో ఉన్న ఉత్సాహమంతా నశించింది. నీ ప్రవర్తనే నన్ను ఆశ్చర్యపెడుతోంది. ఒక స్త్రీ విషయంలో పురుషుడు నీలాగు కృశించి పోవడం చాలా శోచనీయం! నువ్వు నీ జీవితాన్నే పాడుచేసుకుంటున్నావ్! నీ ఆత్మకే ద్రోహం చేస్తున్నావ్! నీ సమస్య యీ జన్మానికి తీరదు--" అన్నాడు.

"కాని...గోపీ. ఎంత ప్రయత్నించినా ఆమెను ప్రేమించలేకపోతున్నా. ఒక క్షణంలో ఆమె మీద వుండే జాలి మరుక్షణంలో మాయమైపోతుంది. ఆమె రూపు నాకు ఆగర్భశత్రువులా కనిపిస్తుంది..."

గోపాలం నిట్టూర్చి, "ప్రేమ!... మనలాటి వాళ్ళంతా ఆ పదాన్ని అపవిత్రం చేస్తున్నారేమో ననుకుంటా- అసలు ప్రేమ అనేది లేదు--" అన్నాడు.

కాళీ ఆశ్చర్యంతో నోరు సగానికి తెరిచి, "ఆఁ" అన్నాడు.

"ప్రేమ అనేది లేదు. ఉన్నా అది కథలకు పనికివచ్చేది కాని మనం జీవితంలో చూడ కలిగేది మాత్రం కాదు--"

"ఎందుకనీ?"

"నువ్వు ఒకప్పుడన్నా- నీ భార్యను ప్రేమించావా? లేదా?" కాళీ ఊకొట్టి తలూపాడు.

"మరి ఇప్పుడో?"

"లేదు" అని తగ్గుస్థాయిలో సమాధానం చెప్పాడు.

"మరి ప్రేమ అనేది ఉంటే అది ఒకప్పుడు వుండటమేమిటి? మరొకప్పుడు ఊడటమేమిటి?"

ఏమో! కాళీకి ఏ సమాధానమూ తోచలేదు. ఇదంతా అతనికి నూతన లోకంలాగు కన్పించింది. బహుశా కొలంబస్ అమెరికాను చూసినప్పుడు ఇల్లాగే ఆశ్చర్యపడి వుంటాడు.

"పోనీ మనం ప్రేమించే వ్యక్తుల శ్రేయస్సును కోరుతాం- అవునా?"

ఈ నూతన సమస్యలు అతి క్లిష్టంగా ఉన్నయి. తను ఇదివరకు ఇల్లాటి వాటిని కలలో కూడా ఊహించలేదే!

"చెప్పు. మనం ప్రేమించే వ్యక్తి సౌఖ్యాన్ని కోరుతాం- ఏం?"

"ఊఁ."

"వాళ్లు బాధపడుతూంటే సహించి ఊరుకోలేం. మనం సహాయం చేస్తాం--"

"చేతకాకపోతే--?"

"చేతనయితేనే--"

"ఊఁ"

"ఇప్పుడు నువ్వు--"

అర్ధోక్తిలోనే అందుకొని, "నాకు చాతకాదుగా!" అన్నాడు కాళీ!

"అందుకనే నీది ప్రేమ కాదు. అసలు ప్రేమ అనేది చాలా అరుదైనదని చెప్పటం."

కాళీ అవునన్నట్టు కళ్లు తిప్పి, బుర్ర వూగించాడు. ఇంకో సందేహం కాళీని ఆవరించింది.

"అయితే నేనొక్కణ్నే ప్రేమలేనివాణ్ణా? అందరూనా?"

"అందరి సంగతీ నాకేం తెలుసు? నేను కన్నంతవరకూ విన్నంత వరకూ ఇంతే అనుకుంటా--"

కాళీ నిట్టూర్చాడు. కిందినుంచి తల్లి భోజనానికి కేకేసింది.

కాళీ ఆత్రుతని కనిపెట్టి, "సరే వెళ్లు. నాకూ పని వుంది--మళ్లీ కనిపిస్తాలే--" అని గోపాలం సర్దుకున్నాడు.

## 8

బాదంచెట్టు మీద కాకులు గుంపు జేరి గోలచేస్తూ కాళిని నిద్ర నుంచి లేపినై.

కళ్లు నలుపుకుంటూ లేచిన కాళీ దృష్టి సరాసరి- తనకోసం కాచుక్కూర్చొని గాలికి రెపరెపా కొట్టుకుంటూ పేపర్ వైట్ కిందినుంచి చూస్తున్న కాగితాల వైపు మళ్లింది.

"నా వ్యర్థజీవితంతోపాటు మీరు కూడా మీ జీవితాన్ని పాడు చేసుకుంటున్నారు. ఇది నా తప్పు కానివ్వండి. మీ తప్పు కానివ్వండి. నేను మాత్రం మీ జీవిత శకటాన్ని తప్పు మార్గంలో నడిపించేందుకు ప్రయత్నించి వుంటాను. ఏ ఆనందాన్నీ ఇవ్వలేని యీ అర్ధాంగికోసం మీరు కన్నీరు కార్చటం అనవసరం. నా నారీత్వమూ, వ్యక్తిత్వమూ, అన్నీ అడుగంటాక నేను యీ లోకానికీ, మీకూ కూడా పనికిరాను! మీ శాంతిమయ జీవితంలో విషాదజ్వాలల్ని ప్రజ్వలింపజేయగల శక్తి నాలో ఎందుకు వుండాలి?

"ఏ మంజులను చూసి మీరు మనశ్శాంతిలేక వేగిపోతున్నారో ఆ ఒక్క మంజుల, ఒక్క ప్రాణి యీ లోకంనుంచి విరమిస్తే మరి రెండు ప్రాణులకు శాంతి వస్తుంది. భార్యాభర్తల్ని ఏ వివాహబంధన బంధించిందో అది తెగితేనే కాని స్వేచ్ఛ వుండదు. నేను బ్రతికి వుండగా మీరు మరో వివాహం చేసుకునేందుకు ప్రయత్నించరు. మీకు ముందు ఆలోచనా వుండదు. మీరు ఏ పనీ చెయ్యలేరు. మీ జీవితం వృథా అయిపోతుంది! ఇందుకు నేను మీ కళ్ల యెదుట కన్పిస్తూ ఉండటమే కారణం! ఇకముందు మీ కురూపి మంజుల మీకు కన్పించదు! ఆమె శరీరాకృతి మీ మనశ్శాంతిని భంగపరచ లేదు....

"ఆనందాన్ని అనుభవించటం మానవుడి జన్మహక్కు. ఆ హక్కు కోసం ఎన్ని ప్రాణులు బలవటం లేదు? మీరు ఆ హక్కును ఉపయోగించి మీ జీవితాన్ని

బాగుచేసుకోండి. మీరు మరో వివాహం చేసుకోవటం మీ విధి అనుకోండి. నా కళేబరానికి కార్చే కన్నీటినన్నా చూడలేని యీ మంజుల కోసం మీరు ఆశపడటం దేనికి? గడిచిందంతా స్వప్నగత వృత్తాంతం.

మీ సౌఖ్యమయ జీవితమే నా ఆత్మకు శాంతి.

నా జీవితంలోని తప్పులన్నింటినీ క్షమించండి- మంజుల."

ఉత్తరం చదువుతూన్నంతసేపూ కాళీ కంటి వెంట నీరు కారుతూనే వుంది. చదవటం పూర్తయ్యాక కాళీ బుర్ర తిరిగిపోయింది. ఆ కుంటి అక్షరాలకున్న శక్తి ఏమోకాని కాళీకి మరో జన్మ ఎత్తినట్టుగా వుంది. ఆ ఒక్కొక్క అక్షరమే తన్ను గాయపరచింది. మంజుల! ఇంకెక్కడి మంజుల! ఆమె ఈపాటికే శాశ్వత నిద్రలో నిమగ్నమై వుండాలి!

కాళీ-పిచ్చివాడిలాగు, "మంజూ! మంజూ" అని తనకున్న బలం అంతట్నీ ఉపయోగించి అరిచాడు.

కిందినుంచి తల్లీ, నౌకర్లు పరుగెత్తుకొచ్చారు.

తల్లిని చూసి కాళీ "అమ్మా!" అన్నాడు.

కాళీ ముఖవైఖరిని పట్టి ఆతృతతో ఆమె, "ఏం నాయనా అల్లా అరిచావ్?" అంది.

"ముందు నౌకర్లను వెళ్ళి వెతకమను మంజుల కోసం..."

తల్లికి అర్థంగాక, "ఏమైంది నాయనా?" అంది.

"ముందు మీరు పోండి. నన్ను ఒంటరిగా విడవండి. అమ్మా! నువ్వు కూడా వెళ్ళిపో. నా ముఖం ఎవ్వరూ చూడొద్దు--"

యజమాని ఉద్రేకం చూసి నౌకర్లు మంజులను వెతికేందుకు ఊళ్ళోకి వెళ్ళారు. తల్లి శాంతంగా కొడుకు వీపు తట్టుతూ, "మంజుల--ఏమైంది?" అని మళ్ళీ అడిగింది.

కాళీకి తను నిలబడ్డ భూమి కుంగిపోతున్నట్టనిపించింది.

దుఃఖం పొంగి వచ్చే గొంతుకతో "ఏమైందీ! వెళ్ళిపోయింది ... నా జీవితపథంలోంచి మాయమైంది. నాలాటి పదును కత్తుల మధ్య చీల్చబడ్డది... ఈ లోకాన్నీ... మానవుడు సాటిమానవుణ్ణే ప్రేమించలేని...యీ పాడు జీవితాన్నీ...నన్నూ, నిన్నూ...వొదిలి వెళ్ళిపోయింది.... అమ్మా..." ఇంకేమీ మాట్లాడలేకపోయాడు.

"మంజుల ఎక్కడికి పోతుంది? నేను దాన్ని యేమీ అనలేదు. నేనంటే దానికి గౌరవం. నా కోసం మళ్ళీ తిరిగి వస్తుంది...అనవసరంగా కలవరపడుతున్నావ్ కాళి.

నౌకర్లు వెళ్లారు- వెతికి వస్తారు- కాస్సేపు పడుకో ఎందుకు కళ్ళను నీళ్ళతో నింపుకుంటావ్?--"

తల్లికి ఇంకేమీ చెప్పలేక "నువ్వు వెళ్లమ్మా! ఈ విషయం ఎవ్వరికీ అర్థంకాదు--" అన్నాడు.

తల్లి మాట్లాడకుండా కిందికి వెళ్లిపోయింది.

దాదాపు అరగంటదాకా కాళీ నిర్జీవపు ప్రతిమలాగ ఉండిపొయ్యాడు. వెనుకటి సంగతులన్నీ కళ్ల ముందు ఆడుతున్నాయి. ఆ ఘోర నరకం తలుచుకుని కంపించిపొయ్యాడు.

గోపాలం వొచ్చాడు.

"గోపీ!" అన్నాడు నేల మీద పడివున్న మంజుల ఉత్తరాన్ని చూపుతూ.

గోపాలం మాట్లాడకుండా ఉత్తరాన్ని చదివాడు. అతని కళ్ళుకూడా అశ్రువుల్ని రాల్చినయ్.

"నా నేరానికి శిక్షలేదీ ప్రపంచంలో. అమాయకురాలూ, నిర్దోషీ అయిన భార్యను చేతులారా చంపాను. నేను హంతకుణ్ణే అయినా శిక్షాస్మృతి నన్నేమీ చెయ్యదు. నా నేరాన్ని దేవుడుకూడా క్షమించడు...." కాళీ పిచ్చివాడులా అరిచాడు.

గోపాలం ఏదో ఆలోచిస్తున్నాడు.

కొంచెం ఆగి మళ్లీ కాళీ భగ్నస్వరంతో సాగించాడు: "ఆమె నా కోసం ఎంత త్యాగం చేసింది! మధురమైన ప్రాణాన్ని బలి ఇచ్చింది! ఆమె త్యాగి! నేను ఎందుకూ పనికిరాని భోగిని! నరబలి స్వీకరించిన నాకు యీ సంఘం ఇంకా గౌరవాన్నిస్తుంది! ఆమెను ఆదరించలేకపొయ్యాను. కష్టపెట్టాను. నిర్దోషిని ఖూనీ చేశాను. చిత్రవధపడ్డది. నా పాదాల కింద నలిగి వాడిపోయింది--ఆమె జీవితం! ఆమెది నేరంలేని శిక్ష! నాది శిక్ష లేని నేరం! ఏ కళ్లతో ఆమెను ద్వేషించానో ఆ కళ్ళకి ఇప్పుడు అంతా మిథ్యగా తోస్తోంది. ఆమె జీవితంమీద నిర్లక్ష్యతతో, నిరాశతో చనిపోయింది...నాకు మనోనేత్రం లేదు. ఒకవేళ ఉన్నా అది గుడ్డిదై వుంటుంది..."

"ఇది నీ తప్పు కాదేమో! దేవుడి తప్పు--"

"ఆయనొకడున్నాడు మనకు. నా దుర్బల హృదయంతో నిలువునా ఆమె ప్రాణాన్ని తీశాను. ఆమె పాదధూళి కూడా నా తాకుడుతో అపవిత్రమౌతుంది. ఆ నిర్మలహృదయం నా రాక్షససత్వాన్ని సహించలేక పోయింది. నా గుండె- ఎంత రాయో! ఆమెలాటి స్త్రీ యీ లోకంలో ఉందని ఎప్పుడూ ఊహించుకోలేదుకూడాను..."

నౌకర్లు తిరిగి వచ్చారు; మంజుల మాత్రం ఎక్కడా కన్పించలేదని చెప్పారు.

తల్లివొచ్చి, "నా గృహలక్ష్మి వొస్తుంది...నా కోసం వొస్తుంది..." అంది.

ఆ ముసలిప్రాణికి ఇంకా ఆశే!

కాళీ దాదాపు పిచ్చివాడైపొయ్యాడు. రెండు వారాలు గడిచాక --

గోపాలం వొచ్చి "ఇంక మంజుల్ని మరిచిపో. కాలచక్రానికి మరపును ప్రసాదించి మనశ్శాంతినిచ్చే అత్యద్భుత శక్తి వుంది. దాన్ని ఉపయోగించుకో--" అని చెప్పాడు.

కాళీ సమాధానంగా అన్నాడు: "ఆమె మృతశరీరం కూడా నాకు కన్పించకుండా పోయింది: దాని క్కూడా నన్ను చూస్తే భయమే! మంజులను మరిచిపోయి కృతఘ్నుణ్నవలేను. ఆమె అదృష్టవంతురాలు. ఈ ఖైదులో ఉండలేక పోయింది. ఆమెలో ప్రేమ వుంది. అందుకనే ఆమె నాకు ప్రాణత్యాగం చెయ్యగలిగింది. నాలో మాత్రం లేదు. నేను పైకి మనిషినైనా లోపల రాక్షసుణ్ణి. ఇల్లాగే వుండి నా జీవితాంత్యానికి ఎదురుచూస్తూ వుంటాను."

– జులై, *1940*